



# 7

# గేటెడ్ కమ్యూనిటీ

అక్కిరాజు భట్టిప్రోలు

"సుధా నే వెళ్లిపోతున్నా," బాత్‌రూమ్ బయట్నుంచి సుధకి వినబడేలా ఓ గావుకేక పెట్టి బయటకు నడిచాడు సతీష్. ఇంకా కమ్యూనిటీలో ఎవరూ బయలుదేరినట్టు లేరు. పిల్లలందరూ ఈపాటికే స్కూలు బస్సుల్లో ఉడాయించేసి ఉంటారు. పెద్దవాళ్లు ఇంకా బాత్‌రూముల్లోనే ఉండి ఉంటారు.

తాను మాత్రం ఏదో పొద్దున్నే మీటింగ్ ఉంది కాబట్టి తొందరగా వెళ్తున్నాడుగానీ లేకపోతే మరో అర గంట తర్వాతే కదా బయటపడేది. ఆలోచిస్తూనే గబ గబ షూస్ వేసుకొని కారు స్టార్ట్ చేశాడు. రివర్స్ చేసి కమ్యూనిటీ రోడ్డు మీద గేట్‌వైపు పోనిచ్చాడు.

గేటును ఆనుకొనే కమ్యూనిటీ క్లబ్ హౌస్. అక్కడి కొచ్చాక గుర్తొచ్చింది... ఈరోజు రాత్రి ప్రసాద్ కొడుకు పుట్టినరోజు పార్టీ అని. క్లబ్ ముందు కారు ఆపాడు సతీష్. వాచ్‌మన్ పరుగున వచ్చాడు.

"ప్రసాదుసారు ఎన్నింటికని చెప్పిండు రాత్రి పార్టీ," తెచ్చిపెట్టుకొన్న తెలంగాణలో అడిగాడు సతీష్.

"పార్టీ ఇవ్వాళ కాదండి. శనివారవండి. ఈరోజే బాబు పుట్టినరోజండి. శనివారం అయితే అందరూ వస్తారని ఆరోజు పార్టీ పెట్టారండి. ఆయ్!" దీర్ఘాలు తీస్తూ గోదావరి జిల్లాని నాలుగు లఘువాక్యాల్లో ఆవిష్కరిస్తూ సమాధానం చెప్పాడు వాచ్‌మన్.

కారు క్లబ్‌నీ, కాలనీ గేట్‌నీ దాటి బయటికి నడిచింది.

సతీష్ అనుకొన్నట్లుగానే ఇంకా ఆఫీసులకు వెళ్లే పెద్దవాళ్లు రోడ్ల మీదకు రాలేదు. స్కూలు బస్సులు, పిల్లలు రోడ్లను ఆక్రమించి ఉన్నారు. మరో అరగంట తర్వాత బైకులు, కార్లతో పెద్దవాళ్లు రోడ్లని తమవి చేసు కొంటారు. టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లు తప్ప ఇంకా ఏ షాపులూ తెరిచి లేవు.

కారు జూబ్లీహిల్స్ రోడ్డు మీదికి చేరేసరికి ట్రాఫిక్ పూర్తిగా జామ్ అయి ఉంది. రోడ్డు వెడల్పు పెంచే పనుల్లో సగం పగలగొట్టిన గోడలు, రోడ్డు మీద వేసిన కంకర, ఇసక... వాటి మధ్య నుంచి ఎలాగోలా ఇరికి, దూరి, పాకి మిగతా వాళ్లందర్నీ వెధవల్లా జమకట్టి పారి పోదామనుకొంటున్న అభినవ షూమాకర్‌ల ధాటికి పూర్తిగా నిలిచిపోయిన ట్రాఫిక్.

'ఈ రోడ్డేదో అయిపోతే కనీసం అరగంట ఎక్కువ నిద్రపోవచ్చు,' భవిష్యత్తులో జరగబోయే మంచిని తలుచుకొంటూ పొద్దున్నే మూడ్ పాడవకుండా విసుగుని కాస్త దూరంలో ఉంచే ప్రయత్నం చేశాడు.

పూర్తిగా నిలిచిపోయిన కార్లొంచి యథాలాపంగా చుట్టుపక్కల చూట్టం మొదలుపెట్టాడు. మొదట ఓ నిమిషం గమనించలేదుకానీ, తన కారు పక్కనే దాదాపు ఆనుకొని ఉన్న స్కూటర్ మీద కూర్చున్న వ్యక్తి తననే చూస్తున్నాడనిపించింది.

"సతీష్?" ప్రశ్నార్థకంగా అడిగాడు ఈలోగా అతను.

"అవును మీరు... నువ్వు... అర్జున్... అవునా?" ప్రశ్నించబోయి వెంటనే గుర్తుపట్టి అడిగాడు.

"కారు ఆగంగానే చూశా... రంగు వచ్చినట్టున్నావు. ఆ కళ్లజోడు... కొంచెం అనుమానించి నువ్వే పలకరిస్తావులే అని చూస్తున్నా," అన్నాడు అర్జున్.

ఇంతలో ట్రాఫిక్ కదిలింది. వెనకవాళ్లు హారన్ మోతలు మోగించకముందే బయలుదేరటం మంచి

దని, ''ముందు ఆపుతా,'' అని స్కూటర్ని ముందుకు పోనిచ్చాడు అర్జున్.

అర్జున్ అలా కొంతదూరం ముందుకుపోయి, త్రినేత్ర ముందున్న పార్కింగ్‌లోకి స్కూటర్ పోనివ్వ డాన్ని గమనించి కారు ఇండికేటర్ వేశాడు సతీష్. ఎదురొస్తున్న ట్రాఫిక్‌లోకి అంగుళం అంగుళం చొప్పున దూరి, దాన్ని దాటి రోడ్డుకి కుడివైపు ఉన్న పార్కింగ్‌లోకి చేరాడు సతీష్.

''హైదరాబాద్ ఎప్పుడు చేరావురా? నాకు తెలిసి ఖమ్మం దగ్గరే ఎక్కడో గవర్నమెంట్ జూనియర్ కాలేజీ లో చేస్తున్నావని విన్నా,'' కారు దిగుతూనే అడిగాడు.

''మూడేళ్ల నుంచి ఇక్కడే ఉన్నా. గవర్నమెంట్ జాబ్ వదిలి ఇక్కడే ప్రైవేట్ కాలేజీలో చేరా.''

గవర్నమెంట్ కాలేజీలో జూనియర్ లెక్చరర్ కన్నా ప్రైవేట్ కాలేజీలో ఉద్యోగాలు మెరుగయిపోయాయా అనే సందేహం వచ్చినా... దానికన్నా ముందు చాలా రోజుల తర్వాత కలిసిన మిత్రుడితో మాట్లాడాల్సిన విషయాలు చాలా ఉండడంతో టాపిక్ మార్చి అన్నాడు.

''నా సంగతేమన్నా తెలుసా? ఆఖరిసారి మనం కలిసింది పదేళ్ల క్రితం అనుకుంటా. నా ఎమ్.టెక్. అప్పటికి అయ్యిందా?'' గుర్తు చేసుకొంటూ అడిగాడు.

''చూచాయగా తెలుసు. సాఫ్ట్‌వేర్‌లో చేరావనీ అమెరికా, ఆస్ట్రేలియా, లండన్, జపాన్, సింగపూర్ ఏవేవో తిరుగుతున్నావనీ విన్నాలే.''

''అన్ని దేశాలేం తిరగలేదులే. అమెరికా చాలా సార్లే వెళ్లాను. ఓసారి సింగపూర్ వెళ్లా అంతే ప్రాజెక్ట్ పని మీద. ఎక్కడా ఉండిపోయే ఉద్దేశం లేదు మొద ట్నుంచీ. వెళ్లి వచ్చేస్తుంటా. ఇక్కడే ఇల్లు కూడా కొనేసు కున్నా. ఓ భార్య, ఓ కొడుకు.''

''ఓ భార్యేనా?'' సతీష్ ఆలోచించకుండా అన్న మాటని వెక్కిరిస్తూ నవ్వాడు అర్జున్. నవ్వాపుకొని అన్నాడు.

''నేనూ ఓ చిన్న ఫ్లాట్ కొనుక్కున్నాలే ఊరి బయట. ఒకే ఒక్క భార్య, ఇద్దరు పిల్లలూ. ఇద్దరూ మొగపిల్లలే.''

ఆఫీస్‌లో మీటింగ్ గుర్తుకొచ్చింది సతీష్‌కి.

''నేను తొందరగా మీటింగ్‌కి వెళ్లాలి. నీ నంబర్ ఇవ్వు. సాయంత్రం కాల్ చేస్తా. ఇంటి దగ్గర కలుద్దాం,'' అన్నాడు సతీష్.

ఇద్దరు మిత్రులు ఫోన్ నంబర్లు తీసుకొని ఎవరి ఉద్యోగాలకి వాళ్లు బయలుదేరారు.

పదేళ్ల తర్వాత కలిసిన మిత్రుడిని అంచనా వేసే ప్రయత్నం చేశాడు సతీష్. చిన్నప్పటి ఆవేశం ఇంకా ఈ మనిషిలో ఉండి ఉంటుందా?

ఓ పల్లెటూళ్లో పదోతరగతి దాకా కలిసి చదువు కొన్న మిత్రులు అర్జున్, సతీష్‌లు. అంత చిన్న పల్లె టూరు నుంచి ఇంత పెద్ద ఉద్యోగం దాకా రాగలిగా నన్న గర్వం అప్పుడప్పుడూ మెదిలినా, అర్జున్ గురించి ఆలోచిస్తే మాత్రం తను సాధించింది గొప్పేం కాదనిపి స్తుంది సతీష్‌కి.

ఊళ్లో అందరికీ బట్టలుతికే చాకలి సాంబయ్య కొడుకు అర్జున్. ఏడోక్లాసులో వాడు జిల్లాలోనే 3వ ర్యాంక్. వాళ్ల నాన్న చదువు మానిపిద్దామనుకొంటే స్కూలు పంతుళ్లే ఫీజులు కట్టి వాణ్ణి ఎనిమిదవ తరగతి లో చేర్చారు. గవర్నమెంటు బళ్లలో అడిగే నామమాత్రపు ఫీజు కూడా కట్టలేని స్థితి సాంబయ్యది. వాళ్లింట్లో కరెంట్ కూడా లేకపోవడంతో సతీష్ పక్కన చేరి చదువు కొనేవాడు.

అర్జున్‌లో ఎవరికీ తెలియని ఒక కసి ఉండేది. పగలూ రాత్రి పడిపడి చదివేవాడు. సతీష్ తన కిష్టమైన లెక్కలు, సైన్సు చదువుతుంటే, అర్జున్ ప్రతీ సబ్జెక్ట్‌నీ ఒకే ఇంటరెస్ట్‌తో చదివేవాడు.

'చాకలోడి తెలివితేటలు కూడా నీకు లేవు,' అని సతీష్‌ని వేళాకోళం చేసినా, అర్జున్‌పట్ల మాత్రం అమర్యాద చూపించలేదు సతీష్ కుటుంబం. సతీష్ తండ్రి గ్రామీణ బ్యాంకులో మానేజర్‌గా పనిచేసేవాడు. చదువు, ప్రభుత్వ ఉద్యోగం నేర్పిన సంస్కారంతో పల్లెటూరి కట్టుబాట్లకు కొంత దూరంగానే ఉండేవారు. సాంబయ్య పొద్దున వచ్చి విడిచిన బట్టలు తీసుకెళ్లినా, అర్జున్ మాత్రం సతీష్‌తో సమానంగా కూర్చుని చదివే వాడు. ఊళ్లో చాలామందికి ఇది మింగుడు పడేది కాదు. సాంబయ్యతో సహా.

'పెద్దోళ్లతో కూర్చొని నువ్వూ పెద్దోడివనుకోమాక,' అని కొడుకును అప్పుడప్పుడూ హెచ్చరిస్తూ ఉండేవాడు సాంబయ్య.

సతీష్ పదో తరగతి పరీక్షలవడంతోనే నానా తంటాలూ పడి వాళ్ల నాన్న ఖమ్మం బ్రాంచ్‌కి ట్రాన్స్‌ఫర్ చేయించుకొన్నాడు. అక్కణ్ణించి సతీష్ చదువు బయట ప్రపంచంలో పడి, ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్ దాటి ఎమ్‌టెక్‌దాకా సాగింది.

అర్జున్ భద్రాచలంలో నానా తంటాలు పడి ఇంటర్మీడియట్, తర్వాత డిగ్రీ చేశాడు. తెల్లవారు

ఝామున పేపర్ వేయటం దగ్గర్నుంచి, ట్యూషన్లు చెప్పడం దాకా అన్ని పనులుచేసి డిగ్రీ చదివాడు. పనులు చేస్తూ డబ్బుల్లేకుండా సైన్స్ సబ్జెక్ట్స్ చదవడం కష్టమని తెలిసి ఇంగ్లీషుని ఆశ్రయించాడు. బి.ఎ. ఇంగ్లీషులో పూర్తిచేసి, నాగార్జునలో ఎం.ఎ. పూర్తిచేశాడు. ప్రతి పైసా లెక్క వేసుకొంటూ అతికష్టంమీద పల్లెటూరు చాకలి కొడుకు ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్ ఉద్యోగం సాధించాడు.

చదువులయేదాకా ఏదో రకంగా పరిచయాన్ని కాపాడుకొంటూ వచ్చిన మిత్రులు, సొంత ఉద్యోగాలు, జీవితాలు ప్రారంభించాక మాత్రం దూరమైపోయారు.

గతాన్ని నెమరువేసుకొంటూ ఆఫీసు చేరాడు సతీష్. 'అర్జున్ ఇక్కడిదాకా రాగలిగాడంటే, నేను బిల్ గేట్స్‌ని దాటితే తప్ప సమఉజ్జీని కాలేను,' అనుకొంటూ పనిలో పడిపోయాడు సతీష్.

## 2

"అవున్రా మర్చేపోయాను నీకు అర్జున్ అని ఎందుకురా పేరు పెట్టారు? ఆ ఊరి లెక్కలో అది చాలా పాష్ పేరు తెలుసా?" అడిగాడు సతీష్ పక్కనే కూర్చున్న అర్జున్‌ని.

"ఊరి లెక్క కాదు. మా చాకలోళ్లకి ఆ పేరు నప్ప దులే. నేను పుట్టినప్పుడు పెద్ద వాన, గాలి దుమారం వస్తే అందరూ అర్జునా, పార్థా, కిరీటీ అంటూ దండ కాలు చదివార్ట. పసిగుడ్డుకి ఆ ఉరుముల చప్పుడికి చెముడు వస్తుందేమోనని భయపడిపోయార్ట. ఏమీ కాలేదు కానీ నాకు మాత్రం అర్జున్ అని పేరు స్థిరమై పోయింది," గుర్తు చేసుకొంటూ చెప్పాడు.

"అవునా?" ఆశ్చర్యంగా అంది అర్జున్ పక్కనే కూర్చున్న అతని భార్య మంగ. తానెప్పుడూ ఈ విషయమే అడగలేదే అని అనుకొంటూ.

శనివారంనాడు కలవాలని నిర్ణయించుకొన్న ప్రకారం అర్జున్ ఇంటికి వెళ్లి అతన్నీ, అతని భార్యనీ ఎక్కించుకొని ఇంటికి తీసుకెళ్తున్నాడు సతీష్. పిల్ల లిద్దరూ చదువుకొంటారులే వాళ్లొద్దని ఖరాఖండిగా చెప్పి, వాళ్లని చూడమని అమ్మానాన్నలకి పురమా యించి బయలుదేరాడు అర్జున్.

"వీడితో ఉంటే ఇంకా చాలా సంగతులే తెలు స్తాయి నీకు," అన్నాడు అర్జున్ భార్య నుద్దేశించి.

మాటల్లోనే కారు కాలనీ గేట్ దగ్గరికి చేరింది. గేటు దగ్గరకు వేసి, పక్కనే ఉన్న రూంలో కూర్చుని వున్నాడు వాచ్‌మన్. కారు ఆగంగానే పరిగెట్టుకొచ్చి ఓపెన్ చేశాడు.

"ఆఫీసుల్నుంచి వచ్చే టైంలో ఎందుకు గేట్ వేస్తావ్. రాత్రిపూట వేస్తే అర్థం ఉంది," విసుక్కున్నాడు సతీష్.

"లేదు సార్. అడుక్కునేవాళ్లు దూరిపోతున్నారు. నిన్న పొద్దున గంగిరెద్దులవాణ్ణి బయటికి పంపడానికి చాలా కష్టమయింది సార్. క్రిష్ణ సార్ గేటు ఎప్పుడూ వేసి ఉంచి ఎవరొచ్చినా చూసి పంపమన్నారు," వినయంగా సమాధానం చెప్తూ గేట్ ఓపెన్ చేశాడు వాచ్‌మన్.

మెల్లగా కారు గేటు దాటి లోపలికి వెళ్లింది.

"ఇందులో ఎన్ని ఇళ్లు ఉంటాయిరా?" బయటికి చూస్తూ అడిగాడు అర్జున్.

"మొత్తం ముప్పై అయిదు. అన్నీ ఇండిపెండెంట్ హౌస్‌లే."

"ఈ ఏరియాలో ఇండిపెండెంట్ హౌస్ అంటే బానే అవుతుంది. సాఫ్ట్‌వేర్‌వాడివి నీకేంటిలే."

"తడిసి మోపెడయింది. సగంమంది అమెరికా నించి తిరిగొచ్చినవాళ్లే. హైటెక్ చుట్టుపక్కల కంపెనీల్లో పనిచేసేవాళ్లే అంతా."

దారిలో క్లబ్‌హౌస్‌ని, స్విమ్మింగ్‌పూల్‌ని చూపిస్తూ ఇంటివైపు పోనిచ్చాడు సతీష్.

క్లబ్‌హౌస్ దగ్గర కాస్త హడావుడి కనబడింది.

"ఈరోజు క్లబ్‌హౌస్‌లో బర్త్‌డే పార్టీ ఉంది. అదీ హడావిడి," వివరించాడు సతీష్.

క్లబ్ వరండాలో ఓ ఇద్దరు కార్టూన్ వేషాల్లో గంతులు వేస్తున్నారు. 'బార్నీ', 'టిగ్గర్' అంటూ పిల్ల లంతా వాళ్ల చుట్టూ తిరుగుతున్నారు.

"మరి నువ్వు వెళ్లవా?" కార్టూన్ వేషాల్ని చూస్తూ అడిగాడు అర్జున్.

"గిఫ్ట్ ముందే కొనేశాలే. అంతా పిల్లల పార్టీనే. మా అబ్బాయి ఈపాటికే అక్కడ చేరి ఉంటాడు. అవసరమైతే కేక్ కటింగ్ టైమ్‌కి ఓ నిమిషం వెళ్లి వస్తా. అది చాలు."

అలాంటి ఇళ్లని సినిమాల్లో తప్ప చూడని మంగ ఒక్క మాట కూడా మాట్లాడకుండా చూస్తోంది. ఇళ్లనీ, ఇళ్లలో ఉన్న కార్లనీ, రకరకాల మొక్కల్నీ చూస్తుంటే ఇరుకు అపార్ట్‌మెంట్లోంచి వచ్చిన మంగకి, వేరే ఏదో దేశం వెళ్లినట్లుగా ఉంది.

"డబ్బున్నవాళ్ల ఇళ్లు ఇలా ఉంటాయి," భార్యని ఉద్దేశిస్తూ అన్నాడు అర్జున్.

"సర్లే దిగు. తొందరగా రెడీ అయితే క్లబ్‌హౌస్ వైపు వెళ్లవచ్చు," అంటూ కారు దిగాడు సతీష్.

కారు శబ్దం విని బయటికి వచ్చింది సుధ.

''రండి... రండి,'' సాదరంగా ఆహ్వానించింది అతిథులని.

''వీడే అర్జున్ అంటే. ఆవిడ వీడి భార్య,'' పరిచయం చేశాడు సతీష్.

''మీ గురించి చాలానే చెప్పాడు సతీష్.''

''మంచా చెడా?'' తేలిగ్గా నవ్వుతూ అన్నాడు అర్జున్.

''బాబు లేడా?'' మొదటిసారి నోరు తెరుస్తూ అంది మంగ.

''వాడా ఆ క్లబ్‌హౌస్ దగ్గరే పార్టీలో ఉన్నాడు. మీరు పిల్లల్ని తీసుకొస్తారేమోనని తొందరగా వచ్చేయమన్నా,'' సమాధానం చెప్పింది సుధ.

''వాళ్లు చదువుకోవాల్ట. వీడో పుస్తకాల పురుగు. కొడుకులని వదుల్తాడా,'' సతీష్.

''నిజం అన్నయ్యా! చిన్న క్లాసులే కదా పోనిమ్మంటే వినరు. చదువో చదువో అని ఒకటే గోల ఎప్పుడూ,'' భర్త మీద ఫిర్యాదు చేసింది మంగ.

'అన్నయ్యా,' అన్న పిలుపు విని ఆశ్చర్యపోయింది సుధ.

తమ హైటెక్ స్నేహితుల్లో ఇలాంటి పిలుపులు వినకపోవటంతో ఆ పిలుపెందుకో ఎబ్బెట్టుగా అనిపించింది సుధకి. చిన్నతనంలో ఇంటిపక్క పిన్నిగారు తండ్రిని, 'అన్నయ్య గారూ,' అని పిలవడం గుర్తొచ్చింది. ఇప్పుడు అదే పిన్నిగారు కనబడితే, తాను 'పిన్నిగారూ' అని పిలుస్తుందా లేక 'ఆంటీ' అని పిలుస్తుందా? మీమాంసలో పడింది సుధ.

కాస్త స్థిమితపడ్డాక ఇల్లంతా తిప్పి చూపించారు సతీష్, సుధలు.

''చాలా గొప్పవాడివైపోయావురా,'' అన్నాడు అర్జున్ మిత్రుడ్ని మెచ్చుకొంటూ.

''నా మొహం గొప్ప. రేపు మా ఆఫీసుకి రా... ఒక్కొక్కడికి ఊరంతా స్థలాలే. నిమిషం సందు దొరికితే మాట్లాడేది ఎక్కడ ఏ స్థలం ఎంత పెరిగిందనే తపన,'' సతీష్.

''జుట్టున్నామె ఎన్ని కొప్పులైనా పెడుతుంది నాయనా,'' నవ్వి అన్నాడు అర్జున్.

భోజనాలు చేసి మిత్రులిద్దరూ చిన్ననాటి కబుర్లలోకి మళ్లారు. ఒకరి కుటుంబాల గురించి ఒకరు అడిగి తెలుసుకొన్నారు.

ఎమ్మెస్సీ చేసి మొన్న మొన్నటి దాకా ఏదో ఉద్యోగం చేసి మానేసిన సుధకీ, పదో తరగతి పాసై, ఇల్లు దాటి బయట ప్రపంచం పెద్దగా తెలియని మంగకీ మధ్య మాటలు పెద్దగా సాగలా. మాటల్లో అనుకోకుండా ఇంగ్లీషులోకి తెలుగులోకి మళ్లే అలవాటున్న సుధ అతి కష్టం మీద భాషని అదుపులో పెట్టుకొనే ప్రయత్నం చేసింది.

అంతస్థులకీ, అంతరాలకీ మించిన సంస్కారం, అభిమానం పుష్కలంగా ఉన్న ఆ నలుగురూ అపురూపమైన ఆ స్నేహాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నపూర్వకంగా ఒకరికొకరు సాయపడ్డారు.

## 3

''నాలుగింగ్లీషు ముక్కలు నేర్చుకోంగానే ఏం చేసినా చెల్లిపోతుందనుకొంటున్నావురా నీ అయ్య! ఒక్కటి పీకితే నీయ్యబ్బ ఆర్నెల్లనాడు తిన్నది కక్కుతావ్,'' ఒక్కసారిగా విరుచుకుపడ్డాడు అర్జున్.

ఉలిక్కిపడ్డాడు వెనకే నిల్చున్న సతీష్.

రైలు టికెట్టు కొనడానికి లైనులో నలుగురు ముందు నిల్చున్న ఓ కుర్రాడి మీద అర్జున్ కోపం. ఆదివారం పాత పుస్తకాల షాపులు చూడ్డానికి బయలుదేరారు మిత్రులిద్దరూ. దారిలో టిక్కెట్ కొనుక్కోవాలంటే కారు ఆపాడు సతీష్.

''అర్జున్ ఆగు,'' అతన్ని కంట్రోలు చేయడానికి ప్రయత్నిస్తూ అన్నాడు సతీష్.

''ఏమిటాగేది. ఈనా కొడుకుని ఇందాకణ్ణుంచీ చూస్తున్నా. ఆ ముందాయన కాస్త మెతగ్గా ఉన్నాడని చూసి దూరిపోతున్నాడు. ఏమిటంటే, వాళ్ల తాతకో, అమ్మమ్మకో టిక్కెట్టు కొంటున్నాట్ట. ముసలాళ్ల టిక్కెట్టు కొంటానికి లైనులో నుంచోనక్కరలేదని ఇంగ్లీషులో దబాయింపు,'' సతీష్‌కు సమాధానం ఇస్తూనే మళ్లీ వాడిని తగులుకొన్నాడు అర్జున్.

''మీ తాతకో వాడమ్మకో టిక్కెట్టు కొంటానికి వాళ్లనే రమ్మను... పక్కకి తప్పుకొని పోనిస్తాం. వాళ్ల పేరు చెప్పి, నువ్విక్కడ వేషాలు వేశావంటే మొహం పగులుద్ది,'' నిక్కచ్చిగా చెప్పాడు అర్జున్.

ఏదో అనబోయిన ఆ కుర్రాడు లైనులో ఉన్న మిగతావాళ్లు కూడా నోరు పెంచడంతో, ''ఐ విల్ కం బ్యాక్ అండ్ సీ యు ఆల్,'' అని పొగరుగా బయటకు వెళ్లాడు.

''ఏందిరా నువ్వు చూసేది. ఇప్పుడే రా చూసుకొందాం,'' అంటూ ఆ కుర్రాడి వెంట పడబోయాడు. అర్జున్‌ని అతికష్టం మీద ఆపాడు సతీష్.

ఇలాంటి గొడవల్లో తలదూర్చి చాలాకాలం అవటంతో కొంచెం ఎబ్బెట్టుగా ఉంది సతీష్‌కి.

''ఆ టికెట్ ఏదో నేనే కొనిచ్చేవాణ్ణిగా ఇంటర్నెట్‌లో. ఈ పిచ్చి గొడవలన్నీ ఎందుకూ. అయినా ఆ భాషేంటి. ఇంగ్లీషులో లెక్చరర్‌వి. వాడు మాట్లాడిన పాటి ఇంగ్లీష్ నీకు రాదా. అక్కడున్న వాడెవ్వడన్నా నీకు ముక్క ఇంగ్లీషు రాదనుకొంటారు ఆ గొడవ చూసి,'' విసుగ్గా అన్నాడు సతీష్ కారు ఎక్కంగానే, కోపంగా ఓ చూపు చూశాడు అర్జున్.

''నువ్వు ఇంటర్నెట్‌లో కొనుక్కొంటావు. అదో మాయాప్రపంచం నీకు. నీకు అందులో సాగుతుంది. నాకు సాగదు. ఈ లైన్లో రేపయినా నాకీ గొడవ తప్పదు. నీలా గేటెడ్ కమ్యూనిటీలో వాణ్ణి కానుగా... బయటి ప్రపంచంతో నాకింకా సంబంధం ఉంది,'' ఆవేశం పూర్తిగా తగ్గకపోవడంతో అర్జున్ మాటలు అదుపు దాటాయి.

''మధ్యలో నా జోలికెందుకు వస్తావు. నీ సంగతి నాకు తెలియదుగానీ నాకందరితోటీ సంబంధాలు అలానే ఉన్నాయి. నేనేమీ ఒదులుకోలా,'' సతీష్.

''ఏమీ వదులుకోలేదా... బయట గంగిరెద్దులు, పగటివేషగాళ్లు మీ కమ్యూనిటీ వాళ్లకి అడుక్కొనే వాళ్లు. బార్బీ, టిగ్గర్ మాత్రం ప్రొఫెషనల్స్. డిస్నీ వాడొచ్చి స్టాంపు కొడితే తప్ప ఆ గంగిరెద్దు, పిట్టల దొర మీ ఇంటి గుమ్మం తొక్కలేరు.''

సతీష్ మౌనంగా ఉండిపోయాడు. అనుకోని ఈ దాడికి ఎలా సమాధానం చెప్పాలో తెలీక మౌనంగా ఉండిపోయాడు.

అర్జున్ వరద అక్కడితో ఆగలేదు.

''తెల్లాళ్లు ఉన్నప్పుడు వాళ్లకీ ఉండేవట ఇలాంటి కాలనీలు. ఇప్పుడు కాలనీలు వేరు. అన్నిటికన్నా పెద్ద కమ్యూనిటీ ఉందిగా. ప్రపంచమంతా ఏమయినా నాకేం అనుకొంటూ, 9/11 వచ్చి ఫెళ్లున చెంపదెబ్బ తగిల్తే తప్ప తెలియలా... బయట ప్రపంచం ఏమను కుంటోందో... ఇప్పుడు మాత్రం తెలిసిందా ఏమిటీ.''

సతీష్ ఇక భరించలేకపోయాడు.

''నేను గొడవ ఎందుకు అన్నందుకు నన్ను తెల్లాణ్ణీ, అమెరికన్నీ చేసేశావ్. అదిపోనీ... ఎంత అన్యా యమైనా... నీలాంటి చదువుకొన్నవాడు కూడా 9/11 తలుచుకొని మురిసిపోవటం బాధాకరం, వెర్రి...'' కోపం గా కాకుండా నిజాయితీగా, బాధ ధ్వనించేలా అన్నాడు.

అప్పటికిగానీ అర్జున్‌కి తాను ఎంత దూరం వెళ్లాడో అర్థంకాలా. తనని తాను అదుపులోకి తెచ్చుకోవ డానికి కాసేపు మౌనంగా ఉండిపోయి, తర్వాత అన్నాడు.

''సారీరా, నోరు జారాను. నేను అంత చెడ్డవాణ్ణి కాదు. నీ మీద నమ్మకం లేకా కాదు.''

''ఫర్లేదులేరా... ఇదేం మొదటిసారి కాదుగా,'' నవ్వేశాడు సతీష్. అంటూనే ఆలోచనలో పడ్డాడు సతీష్. అర్జున్ అన్నదాంట్లో నిజం లేదా అని. బయట కరెంటు పోయినా తమకి జనరేటర్ ఉంటుంది. నీళ్లు రాకపోతే టాంకర్లు వస్తాయి. ఊరిలో బంద్ జరుగుతున్నా టికెట్టు ఇంటర్నెట్‌లో కొనుక్కోగలరు. నీళ్ల కోసం, కరెంటు కోసం... ప్రతిదాని కోసం వీధిన పడాల్సిన అవసరం దాటిపోబట్టే అంత డిగ్నిఫైడ్‌గా ఉండగల్గుతున్నారా?

ఆలోచనల్లోంచి బయటపడుతూ అన్నాడు సతీష్. ''కాదులేరా, కోపంతో వాగినా, నువ్వు చెప్పింది కూడా ఓ రకంగా నిజమే.''

''పోనీరా... వదిలెయ్ ఆ టాపిక్,'' బలవంతంగా ఆ సంభాషణని తుంచేశాడు అర్జున్.

**4**

''అయితే మిత్రులిద్దరూ గొడవ పడ్డారన్నమాట,'' అంది సుధ సతీష్ చెప్పిందంతా విని.

''గొడవేం కాదులే. అర్జున్‌తో దోస్తీ అంటే ఇలాంటివాటికి సిద్ధపడాల్సిందే. తిక్క వెధవ,'' అది మెచ్చుకోలో, తెగడ్తో తెలీకుండా అన్నాడు సతీష్.

''ఆశ్చర్యమేం లేదు. మంగతో పార్క్ కెళ్లానని చెప్పానా, అక్కడా ఇలాంటి గోలే నాకు,'' అంది సుధ, అంతవరకూ దాచిన సంఘటనని చెప్పడానికి సిద్ధ పడుతూ.

''మొన్న గురువారం నాడు పిల్లలందరికీ ఏదో శెలవు. నువ్వు, అర్జున్ ఆఫీసులకు వెళ్లినప్పుడు నేను, మంగ కలిసి పిల్లల్ని పార్కుకి తీసుకెళ్లామని చెప్పాను, గుర్తుందా?'' అడిగింది సుధ.

''ఆ... నువ్వు ఫోన్ చేశావు. మంగకి నేనే ఎందుకు గుర్తొచ్చానా అని...''

''అవును. నేరుగానే చెప్పిందిలే... 'మీతో అయితే కారులో వెళ్లి రావచ్చు... ఈ ఎండలో ఇద్దరు పిల్లల్ని తీసుకొని సిటీబస్సులో వెళ్లే ఓపిక లేక మీకు ఫోన్ చేశాను,' అని చెప్పేసింది,'' అంది సుధ.

''పోనీలే నిజాయితీగా చెప్పిందిగా,'' అన్నాడు సతీష్.

''అదికాదు ముఖ్య విషయం. పార్కులో ఉన్న రెండు ఉయ్యాలల్లో ఇద్దరు పిల్లల్నీ కూర్చోబెట్టి

ఊపడం మొదలుపెట్టింది. అరగంట అయినా వదల్దు. మనవాడు ఆ పక్క ఎవణ్ణో దోస్తీ చేసుకొని హారీపోటర్ గురించి మాట్లాడుతున్నాడు. చుట్టుపక్కల బోలెడు మంది పిల్లలు ఆ ఉయ్యాల చుట్టూ ప్రదక్షిణాలు. మంగ తన పిల్లల్ని దింపి వేరే పిల్లలకి ఇస్తే బావుణ్ణని నాకెంత అనిపించినా నోరు మెదపలా. ఓ బామ్మగారు వచ్చి మంగతో నీ పిల్లల్ని దింపి నా మనవరాళ్ళి ఎక్కి స్తావా లేదా అని గొడవ. నాకు తల కొట్టేసినట్టని పించింది. మంగ తడుముకోకుండా ఇంకో అయిదు నిమిషాలు అని తన పని తాను చేసుకుపోయింది. చుట్టుపక్కల అందరూ బయటికే వినబడేట్లుగా ఎన్ని అన్నా చీమ కుట్టినట్టయినా లేదు మంగకి. నాకు ఆశ్చర్యమేసింది.''

''గుడ్... నువ్వేం వేలుపెట్టలేదుగా,'' అనుమా నంగా అడిగాడు సతీష్.

''దాదాపు వేలు పెట్టలా. కాని అంతా అయి పోయాక నోరు ఊరుకుంది కాదు. పాపం ఆ పెద్దావిడకి ఇచ్చేస్తే పోయేదేమో... ఆ చంటిది ఆవిడ ప్రాణం తీసే స్తోంది ఆ ఉయ్యాల కోసం అన్నా,'' గాలి పీల్చుకోవ డానికి ఆగింది సుధ. ఊపిరి బిగబట్టి వింటున్నాడు సతీష్. మళ్లీ మొదలుపెట్టింది సుధ.

''మీకేమండీ చెపుతారు... మీ పిల్లాడు మీ కమ్యూనిటీ పార్కులో హాయిగా ఆడుకొంటాడు. మళ్లీ మీలాంటివాళ్లు ఎవరైనా కారులో తీసుకొస్తే తప్ప మా పిల్లలకి ఈ ఉయ్యాల దొరకదు. అభిమానం, పరువు కాపాడుకోవాలంటే సిటీబస్సుల్లోను, పబ్లిక్ పార్కుల్లోను కష్టం. ఇద్దరు పిల్లల్ని తీసుకెళ్లాలంటే మా ఆయన రావాలి. ఆయన ఆదివారం తప్ప రారు. ఆదివారం నాడు ఇంకా ఎక్కువ గొడవలు పడాలి. కాసేపు చెవులు మూసుకోవటమే శరణ్యం, ఇక్కడ పని కావాలంటే,'' మంగ అన్న మాటల్ని తానే అన్నట్టుగా అభినయిస్తూ చెప్పింది సుధ.

''హు... కాస్త జాగ్రత్తగా ఉండాలి అర్జున్, మంగ లతో. మర్చిపోకు, అంత కాకపోయినా అలాంటి ప్రపం చంలోంచే వచ్చాం మనం,'' భార్యకు చెప్తున్నట్టున్నా తనకే చెప్పుకొంటూ అన్నాడు సతీష్.

''నాకు తెలియదా. అర్జున్ సంగతి నాకు తెలి యదు కానీ మంగ బంగారం. అటువంటి మనిషి అంత నిర్దయగా ప్రవర్తించాలంటే ఎంతటి క్షోభ అనుభ విస్తుంటుందో,'' బయటికే వినబడేలా అనుకుంది సుధ.

## 5

''ఏమండీ మంగ ఫోన్ చేసి ఏడుస్తోంది. ఏదో గొడవ జరుగుతోందట,'' ఒకరోజు ఆఫీసుకు ఫోన్ చేసి చెప్పింది సుధ.

''మళ్లీ ఆ స్థలాల గొడవేనా... అబ్బా... సరే నే వస్తున్నానని చెప్పు,'' అర్ధరాత్రి దాకా ఊపిరి సలప కుండా ఉన్న పనిరోజు మధ్యలో బయటపడితే జరగ బోయే పరిణామాల్ని అంచనా వేసుకొంటూ కారు తాళాలు తీసుకొని బయలుదేరాడు సతీష్.

పావుగంటలో అర్జున్ ఇంటి దగ్గరకు చేరాడు. మెయిన్‌రోడ్డు మీదే కనబడ్డారు జనాలంతా. పోలీసులు, జనాలు అంతా గందరగోళంగా ఉంది. ఎక్కడని వెతకాలి అర్జున్ కోసం అనుకొంటూ కారు వేగం తగ్గిం చాడు. పక్కనే ఉన్న ట్రాఫిక్ పోలీసు, 'నికాల్ నికాల్...' అంటూ హడావిడి పెట్టాడు. ఉన్న గొడవని చూడ్డానికి ట్రాఫిక్ అంతా నిలిచిపోతుందేమోనని అందర్నీ త్వర త్వరగా పంపించే ప్రయత్నంలో ఉన్నాడు.

ఇలా కాదని కాస్త ముందుకు పోనిచ్చి పక్క సందులో కారు ఆపి మెయిన్‌రోడ్డు వైపుకి నడిచాడు. ఇంతలో జనాలు ఆడా మగా మెయిన్‌రోడ్డు మీద నుంచి పరిగెట్టుకొంటూ వస్తూ కనిపించారు. వాళ్ల వెనక పోలీసులు లాఠీలు ఝుళిపిస్తూ వెంటపడుతున్నారు. ఇలా కాదని తాను కూడా వెనక్కి తిరిగి, మళ్లీ కారులో దూరి స్టార్ట్ చేసి, పరిగెట్టించడానికి సిద్ధంగా ఉంచి, సెల్ ఫోన్ తీసి అర్జున్‌కి ఫోన్ చేశాడు. ముందే చేస్తే, 'నీ పని నువ్వు చేసుకో. నాకేం ఫర్లేదు. ఇక్కడికేం రానక్కర్లేదు,' అంటాడని తెలిసి అప్పటిదాక ఫోన్ చెయ్యలేదు.

''ఎక్కడరా, నీ కోసమే చూస్తున్నా... స్వప్న నర్సింగ్ హోమ్ ముందున్నా,'' అర్జున్ ఫోన్ ఎత్తగానే హలో అని కూడా అనకుండా అడిగాడు.

''వచ్చేశావా... అక్కడే ఉండు వచ్చేస్తున్నా,'' చాలా ప్రశాంతంగా జవాబు చెప్పాడు అర్జున్.

వీడింత ప్రశాంతంగా ఉంటే నేనెందుకు ఆఫీసు మానేసి వచ్చాను అనుకొంటూ రియర్ వ్యూ మిర్రర్‌లో అర్జున్ కోసం చూడసాగాడు.

ఓ మూడు నిమిషాల తర్వాత తీరిగ్గా వచ్చాడు అర్జున్. చేతిలో అప్పుడే కొన్న మంచినీళ్ల బాటిల్. డోర్ ఓపెన్ చేసి పక్కనే కూర్చున్నాడు. క్షణం ఆలస్యం చెయ్యకుండా కారు పోనిచ్చాడు సతీష్. డ్రైవ్ చేస్తూనే అడిగాడు, 'ఏమిటి గొడవ,' అని.

''ఔటర్ రింగ్‌రోడ్డు మా ఇళ్ల మీంచి వేస్తార్ట. ఆ గొడవ ఎప్పణ్ణించో రగుల్తోంది. ఇవ్వాళ ఇక్కడి ఎం.పి. ప్రైవేట్ కాలేజ్ ఓపెనింగ్ కోసం వస్తున్నాడంటే రోడ్డు మీద కాపు కాశాం... కాలేజి మానేసి మరీ,'' చాలా మామూలుగా పూర్తిచేసి, బాటిల్లో నీళ్లు రెండు గుక్కలు తాగాడు.

''రెండు నిమిషాల్లో ఎం.పి వస్తాడనగా పోలీసులు లాఠీలు పుచ్చుకొని వెంటపడ్డారు. తలా ఓ దిక్కుకి పరి గెట్టారు... నేను పక్కన ఫుడ్ వర్ల్డ్‌లో దూరి ఈ నీళ్ల బాటిల్ కొనుక్కొని బయటికి వచ్చా... నీ ఫోన్ వచ్చింది.''

''ఏదో గొడవ జరిగిపోతోందని అంటే ఎవడితో పెట్టుకున్నావోనని భయపడి ఆఫీసు నుంచి పరిగెట్టు కొని వచ్చా,'' కాస్త విసుగ్గా అన్నాడు సతీష్.

''మంగ భయపడి ఉంటుందిలే... మేము గొడవ చేద్దామనే వెళ్లాం. రోడ్డు మీద కూర్చుని ట్రాఫిక్ ఆపేసి... ఎం.పి. ఎక్కడికీ వెళ్లకుండా చెయ్యాలనుకొన్నాం. అను కొన్న వాళ్లలో సగంమంది కూడ రాలా... తెల్లారేసరికి ఎవడి ఉద్యోగం వాడికి ముఖ్యం... వెళ్లిపోయారు. నాలాంటివాళ్లం కొందరమే వెళ్లాం. పోలీసోళ్లు లాఠీ చూపించగానే అసలే పలచగా ఉన్న జనాలు... ఏం సాధిస్తాం చెప్పు... పారిపోయి వచ్చాం...'' అనుకొన్నది సాధించలేకపోయిన అసంతృప్తి ధ్వనిస్తూ చెప్పాడు అర్జున్.

''ఏమీ సాధించలేమని తెలిసినప్పుడు ఈ గొడవ లెందుకు? ఆ ఎం.పి. దగ్గరకే నేరుగా వెళ్లి మాట్లా డొచ్చుగా?'' సతీష్.

అంటుండగానే కారు అర్జున్ ఇంటి ముందు ఆగింది. సుధ అప్పటికే వచ్చి మంగ పక్కన కూర్చుని ఉంది. అంతవరకూ ప్రశాంతంగా ఉన్న అర్జున్‌కి మంగని చూడగానే చుర్రుమంది.

''ఊరంతా టాంటాం చేశావా? నేనేవణ్ణన్నా మర్డర్ చేయడానికి వెళ్లానా... లేకపోతే ఏవన్నా టంగు టూరి ప్రకాశం లెవెలనుకొన్నావా?'' అని వాళ్లావిడ మీద విరుచుకుపడ్డాడు.

''లేదండీ... వ్యాన్లకి వ్యాన్లు పోలీసులు దిగారు చౌరస్తాలో అని అందరూ అంటుంటే భయమేసింది. చుట్టుపక్కల ఫ్లాట్లలో ఎవరూ లేరు. నేను కదుల్దా మంటే చిన్నోడు స్కూలు నుంచి వచ్చేసే టైం. సుధకి ఫోన్ చేశానుగానీ ఇద్దర్నీ వచ్చెయ్యమన్లా... ఏమన్నా ఫోన్ చేసి మీ కబురు కనుక్కుంటారేమోననుకున్నా... నేను చేస్తే ఎలాగూ ఫోన్ ఎత్తరుగా...'' సంజాయిషీ ఇచ్చు కొంది మంగ.

''అయినా ఏమిటి గొడవ,'' మళ్లీ మొదటి ప్రశ్న వేసింది సుధ.

''మళ్లీ మొదలు. ఈ ఫ్లాట్లు మాకమ్మిన బిల్డరు అన్ని పర్మిట్లూ సక్రమంగా ఉన్నాయని చూపిస్తే కొన్నాం. ఇప్పుడు ఔటర్ రింగ్‌రోడ్డుకి అడ్డొచ్చిందని కూల్చేస్తారట. గొడవ మొదలుపెడితే, ఏవేవో పర్మిట్లు లేవని దబా యింపు. మేము ఇళ్లు కొనుక్కొని రిజిష్టర్ చేయించు కున్నప్పుడు ఏమీ మాట్లాడని నా కొడుకులు ఇప్పుడు మా వెంట పడుతున్నారు. ఆ పొలిటీషియన్లంతా... ఆ ఔటర్ రింగురోడ్డు పక్కలంతా స్థలాలు ముందే కొనేసు కొని ఉంచుకొన్నారు. ఏమడ్డమొచ్చినా ఆ రోడ్డు ఇప్పుడు వేయాల్సిందే...'' బాధంతా వెళ్లబోసుకొన్నాడు అర్జున్.

కొంతసేపు మౌనంగా ఉన్న సుధ ఇక ఉండలేక పోయింది. ''రింగురోడ్డు గురించి గవర్నమెంటు కూడా గట్టిగానే ఉంది. కష్టమే. ఏ రోడ్డు వేసినా కొన్ని ఇళ్లు పోక తప్పదుగా... అయినా... కాంపెన్సేషన్ ఇవ్వరా?'' భయం భయంగానే అడిగింది.

''అవునా... మరి ఒక్క గేటెడ్ కమ్యూనిటీ కూడా పోవట్లేదేం ఏ రోడ్డు కిందా?'' వెటకారంగా అన్నాడు అర్జున్.

సుధకి ఆ వెటకారం ఏమాత్రం నచ్చలా. ''జూబ్లీ హిల్స్ రోడ్డు చూశారా... అందరూ డబ్బు, పరపతి వున్న వాళ్లే... అయినా అన్నీ పడగొట్టి రోడ్డు వెడల్పు చేశారు,'' అంది.

''హ... హ... హ...'' అంటూ విరగబడి నవ్వాడు అర్జున్.

''అమ్మాయీ! నీకు చాలా సంగతులు తెలీవు. ఆ ఇచ్చే కాంపెన్సేషన్ మాకెలా సరిపోతుందనుకొంటు న్నావ్? మేము ఈ ఇంటిని ఎంతకి రిజిస్ట్రేషన్ చేసుం టాం? పన్నెండు లక్షల ఇంటిని అయిదు లక్షలని చెప్పి రిజిష్టర్ చేస్తాం. నన్ను తప్పు పట్టకు. అలా కాకపోతే బిల్డర్ నాకు అమ్మడు. వాడికిచ్చే బ్లాక్‌మనీ వాడికివ్వా ల్సిందే. ఇహ ఇప్పుడు గవర్నమెంటు ఆ లెక్కన... మరి కొంచెం కలిపి ఏ ఆరులక్షలో ఇస్తుంది. ఆ పోయిన బ్లాక్ మనీని ఎక్కణ్ణుంచి తేనూ? మేం ఎక్కువ గొడవ చేస్తే ఏదో పర్మిట్ లేదని చెప్పి అది కూడా ఎగ్గొడతామని బెదిరింపులు.''

అందరూ వింటున్నారో లేదోనని గమనించి మళ్లీ మొదలుపెట్టాడు అర్జున్.

''ఇక జూబ్లీహిల్స్ మారాజుల సంగతి. పాపం వాళ్ల ఇళ్లని కూడా కూల్చారు కదా! మీరు చదివారో లేదో...

ఆ ఇళ్లు కూలగొట్టడానికి ముందు... ఆ ఏరియానంతా కమర్షియల్ జోన్‌గా డిక్లేర్ చేసింది గవర్నమెంటు. ఒకే అంతస్తున్న ఇళ్లు ఇప్పుడు మూడు నాలుగంతస్తులు, కమర్షియల్ కాంప్లెక్సులు కట్టుకోవచ్చు. అంటే, నాలుగు వందల గజాల స్థలంలో ఓ వంద గజాలు పోయినా, మిగిలిన మూడు వందల గజాలకి కొత్త పర్మిట్ల కారణంగా పెరిగిన ధర అంతకంటే చాలా ఎక్కువన్నమాట. వాళ్ల బ్లాక్‌మనీ చూడు ఎంత భద్రంగా ఉందో. వాళ్లు పోగొట్టుకొనే బ్లాక్‌మనీని మార్కెట్లోంచే వాళ్లు సంపాదించుకొంటారు. మా పరిస్థితి అదిగాదు.''

ఓ రెండు నిమిషాలు అందరూ మౌనంగా వున్నారు. చివరికి సుధే మాట్లాడింది.

''మీరేమనుకోనంటే ఓ మాట చెపుతా... మీ కష్టాన్ని అర్థం చేసుకొంటా. అందుకే నేనూ, సతీష్ మీ కోసం పరిగెట్టుకొంటూ వచ్చింది. కానీ మేమంటే... గేటెడ్ కమ్యూనిటీలో ఉన్నవాళ్లమంటే ఏదో పాపం చేసి, అన్యాయంగా దోచుకొన్న డబ్బేదో తినేస్తున్నట్టుగా మాట్లాడుతుంటేనే బాధగా ఉంటోంది. మా మట్టుకు మేము నెలనెలా జీతాల్లోంచి ఖచ్చితంగా టాక్సులు కడుతున్నాం. మాకు తోచినంత ఛారిటీ పని చేస్తున్నాం. వ్యక్తులుగా మమ్మల్ని తప్పుపట్టే అర్హత ఎవరికీలేదు. ఎవరి మీద కోపమో మా మీద చూపిస్తారేంటి? ఏం... మీరు చాకలి పని మానేసి ఈ ఫ్లాట్‌లోకి రాలేదా... మీ కజిన్ ఇంకా శ్రీనగర్ కాలనీలో ఇస్త్రీ బండి పెట్టుకొన్నాడని మీరే చెప్పారు... అతని దృష్టిలో మీరూ ఓ మాదిరి గేటెడ్ కమ్యూనిటీనే. రేప్పొద్దున మీ పిల్లలిద్దరూ చదువుకొని మా ఇంటి పక్కనే చేరొచ్చు... అప్పుడు మీకేమీ తప్పనిపించదు కదా.'' ఎడాపెడా తన ఆవేశాన్ని దించేసుకొన్న సుధ తన కళ్లలో నీళ్లు తిరగడాన్ని గమనించలా...

మంగ గబగబా సుధ దగ్గరికి వెళ్లి భుజం మీద చెయ్యి వేసి సముదాయించే ప్రయత్నం చేసింది. ఇంత అకస్మాత్తుగా సుధ ఇలా విరుచుకుపడుతుందనీ, అర్జున్ మాటలు ఆమెని ఇంత బాధిస్తాయని గమనించకపోవడంతో మౌనంగా చూస్తుండిపోయాడు సతీష్.

''లేవండి ఇంటికి పోదాం. నన్ను దింపేసి మీరు ఆఫీసుకి పోదురుగాని,'' కర్చీఫ్‌తో కళ్లు తుడిచేసుకొని లేచింది సుధ.

అంతసేపు మౌనంగా వింటున్న అర్జున్ మెల్లగా లేచాడు. సుధ దగ్గరగా వెళ్లి చనువుగా ఆమె చేతులు పట్టుకొని అన్నాడు.

''అయామ్ సారీ సుధా! మీ మీద నమ్మకం లేక కాదు. నువ్వన్నట్టుగా నన్ను దాటి నా పిల్లలు ముందుకెళ్లాలనేగా నా తాపత్రయం. బాధేమిటంటే మనం ఏం వదిలేసుకొని ఏం సాధించుకొంటున్నామని. బయటపడలేని ఏదో వెర్రిలో పడి కొట్టుకుపోతున్నాం అందరం. ప్రతివాడి చుట్టూ గోడలే. మనందర్నీ కలిపి బాధించే విషయమేదీ కనబడదేం? ఎవరి మీద చూపించాలో తెలియని కోపాన్ని మూర్ఖంగా మీమీద చూపించాను. వీడు గాంధీ... ఏమన్నా నోరు మెదపడు... నా నోటికొచ్చినట్టు వాగొచ్చనుకొన్నా... నిన్ను గమనించకపోవడం తప్పే... ప్లీజ్ డోంట్ లీవ్,'' ఆఖరి మాటలు అంటూ సుధ తల మీద చేయి వేసి బతిమాలుతున్నట్టుగా అన్నాడు అర్జున్.

''ఇంగ్లీషులో ప్లీజ్ అంటే అన్నీ సర్దుకుపోతాయా... నాలుగింగ్లీషు ముక్కలు నేర్చుకోంగానే ఏం చేసినా చెల్లిపోతుందనుకొంటున్నావురా నీ అయ్య,'' మొదటిసారి అర్జున్ భాషలో అతణ్ణే అనుకరిస్తూ దాడి చేశాడు సతీష్... నవ్వుతూ...

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 23 జులై 2006*

